
అలమూరులో ప్రతిష్ఠించిన భారీ మట్టి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


సఖినేటిపల్లి క్షత్రియ కల్యాణ మంటపంలో వినాయకుడికి పూజలు చేసిన సూర్యారావు


చాకలిపాలెంలో ఉయ్యాలలో కొలువుదీరిన గణపతి


చింతలమోరిలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు


అంబాజీపేటలో 116 అరటి గెలలతో అలంకరించిన గణపతి ఆలయం

క్లుప్తంగా

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక


తైక్వాండో పోటీలకు ఎంపికైన శశిరేఖ, ధరణి

రాజోలు: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు రాజోలుకు చెందిన వై.శశిరేఖ, సీహెచ్ ధరణిలు ఎంపికయ్యారని తైక్వాండో కోచ్ ఆర్.మణికుమార్ ఆదివారం తెలిపారు. గత నెల విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వీరు ఇరువురు ఈ నెల 8, 9, 10 తేదీల్లో ఆగ్రాలో జరిగే 12వ సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రాజోలు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో తైక్వాండోలో శిక్షణ ఇచ్చామన్నారు. ముదునూరి అక్కిరాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ముదునూరి లతేంద్రవర్మ, నాయకుడు దేవళ్ల వెంకటరమణ తదితరులు జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

వినికిడి సమస్య ఉన్న చిన్నారులకు సాయం


సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: కవలలుగా పుట్టిన ఇద్దరి చిన్నారులకు వినికిడి సమస్య ఉండటంతో వారికి వైద్యం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.15 వేల నగదును ఆర్థిక సాయంగా ఆదివారం అందజేశారు. కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన గుబ్బల చైతన్య శివ నాగగణేష్, గుబ్బల లక్ష్మీ వెంకట దుర్గాశ్రీల వయస్సు 4 ఏళ్లు. ఇద్దరూ కవల పిల్లలు. వీళ్లిద్దరూ వినికిడి సమస్యతో పుట్టారు. ఆపరేషన్ చేస్తే వినబడుతుందని డాక్టర్లు చెప్పడంతో వీళ్లకి ఉన్న ఒక్క ఇల్లు అమ్మేసి ఆపరేషన్ చేయించారు. అయితే మాటలు రావాలి అంటే స్పీచ్ థెరపీ ఇప్పించాలి. కార్పెంటర్‌గా పని చేసే తండ్రి శ్రీనివాస్‌కు ఆర్థిక స్థోమత లేకపోవడంతో కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో సభ్యుల చేతుల మీదుగా వారికి రూ.15 వేలు సాయాన్ని అందజేశారు.

బాధితురాలికి సాయం


గొందిలో బాధిత బాలిక కుటుంబానికి సాయం అందజేస్తున్న బుజ్జిరాజు

సఖినేటిపల్లి: హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న వసుధ ఫౌండేషన్ మండలంలోని గొందికి చెందిన కరెంట్ షాక్ బాధితురాలు బర్రే దుర్గాభవానీకి ఆదివారం రూ.20 వేల ఆర్థికసాయం అందజేసింది. దుర్గాభవానీ ఇటీవల ప్రమాదవశాత్తూ కరెంటు షాక్‌కు గురై, కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయాన్ని ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు దృష్టికి రాజోలు నియోజకవర్గ ఫౌండేషన్ కన్వీనర్ జంపన బుజ్జిరాజు తీసుకువెళ్లారు. దీంతో ఆయన తక్షణ సాయంగా పంపిన రూ.20 వేల నగదును బాధిత బాలిక కుటుంబానికి ఇంటి వద్ద బుజ్జిరాజు చేతులమీదుగా అందజేశారు. సర్పంచ్ దొండపాటి రవి కుమార్, ఫౌండేషన్ ప్రతినిధి బోణం రాజు, తాడి సహదేవ్, ఎ.మధు రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.2 లక్షల విరాళం


చెక్కును ఎమ్మెల్యే వరప్రసాద్‌కు అందిస్తున్న కరస్పాండెంట్ గిరి, విద్యార్థులు

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక మదర్‌థెరిసా నర్సింగ్ కళాశాల విద్యార్థులు, యాజమాన్యం సమకూర్చిన రూ.2 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందించారు. మలికిపురంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు ఈ మేరకు చెక్కును అందించారు.

లక్ష్మీనృసింహునికి జన్మ నక్షత్ర పూజలు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహునికి జన్మనక్షత్రమైన స్వాతి రోజుని పురస్కరించుకుని ఆదివారం స్వామికి అర్చకులు అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. తొలుత వశిష్ట గోదావరి నది నుంచి కలశలతో తెచ్చిన పవిత్ర జలాలకు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. అలాగే సర్వదేవతలను కలశల్లోకి ఆవాహనం చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నారసింహ హోమం నిర్వహించారు.

జైజై.. గణేశా.. జైకొడతా గణేశా..

- ఘనంగా గణపతి నవరాత్రులు ప్రారంభం
- వాడవాడలా వెలసిన మంటపాలు
- పల్లెల్లో గణపతి ఉత్సవాల సందడి

కొత్తపేట: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వాడవాడలా గణపతి నవరాత్రులు జైజై గణేశా అంటూ ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాలు, శివారు గ్రామాల్లోని సిద్ధివినాయకస్వామి ఆలయాలతో పాటు ప్రత్యేకంగా గణపతి నవరాత్ర పందిళ్లలో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలతో ఉత్సవాలు చేపట్టారు. కొత్తపేటతో పాటు మండలంలోని గ్రామాల్లో గణపతి నవరాత్ర యాగదీక్షా మహోత్సవాలు, ప్రత్యేక పూజలు వైభవంగా ప్రారంభించారు. దీనిలో భాగంగా భూగర్భాలయంలో ఆది గణపతి విగ్రహంతో రెండు విగ్రహాలు కలిగి, భక్తుల కోర్కెలు తీర్చే ఆలయంగా ప్రసిద్ధి చెందిన స్థానిక కళానగర్ సిద్ధివినాయకస్వామి వారి ఆలయంలో కమిటీ చైర్మన్ గాలిదేవర పుల్లయ్య నాయుడు, సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో శైవాగమ పండితుల పర్యవేక్షణలో తొలిరోజు ఆలయ పోషకులు రిటైర్డ్ డీఎస్పీ వానపల్లి సుబ్రహ్మణ్యం, ప్రముఖ వ్యాపారవేత్తలు వానపల్లి శ్రీనివాస్, సాయిరామ్ సోదరుల దంపతులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వామివారికి అభిషేకం, యాగం, విశేష పూజలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు, అత్యధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కెట్ వద్ద సిద్ధి వినాయకస్వామివారి ఆలయంలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ దంపతులు, పాట్టి శ్రీరాములు వీధిలో ఆలయ కమిటీ కన్వీనర్ డాక్టర్ వానపల్లి సుబ్బారావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో, స్థానిక కొప్పిశెట్టివారి వీధి, సంతోష్ నగర్, గౌతమినగర్ తదితర శివారు ప్రాంతాలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి.


మొగలికుదురులో మినీ సైకిల్‌పై వినాయకుని ఊరేగింపు

108 గెలలతో అలంకరణ

అంబాజీపేట: అంబాజీపేట శివారు గంగలకుర్రు మలుపులో వేంచేసిన విజయగణపతి ఆలయాన్ని 108 అరటి గెలలతో సర్వాంగ సుందరంగా అలకరించారు. వినాయక చవితిని పురస్కరించుకొని స్థానిక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో యువకులు కర్పూర, చక్కెరకేళి, అమృతపాణి, పచ్చఅరటి గెలలతో గణపతి ఆలయానికి అలంకరించారు. ఈ సందర్భంగా వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని గణపతి నవరాత్రులను అత్యంత వైభవంగా నిర్వహించారు. మాచవరం దొమ్మేటి వారిపాలెం వద్ద ఉన్న గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకుంటున్న ఉయ్యాల గణపతి

పి.గన్నవరం: గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా మండలంలోని చాకలిపాలెంలో ఆర్పీ రోడ్డు పక్కన ఉయ్యాలలో ఏర్పాటు చేసిన వినాయకుని


కొత్తపేట కళానగర్ గణపతి ఆలయంలో హోమ పూజలు నిర్వహిస్తున్న వానపల్లి సుబ్రహ్మణ్యం సోదరులు


రావులపాలెంలో క్షీరసాగర మథనంలో వినాయకుడిగా ఏర్పాటు చేసిన గణనాథుడు

ఉత్సవ విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. న్యాయవాది మొల్లేటి శ్రీనివాసరావు నివాసం వద్ద ఏటా ఉయ్యాలలో వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆర్పీ రోడ్డులో వెళ్లే ప్రయాణికులు అక్కడ ఆగి ఉయ్యాల గణపతిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: మండలంలోని గ్రామాల్లో వినాయక ఆలయాలు చవితి గణనాథుని ఉత్సవాలతో అత్యంత సుందరంగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామ కూడళ్లలో ఏర్పాటు చేసి గణనాథుని మండపాలను భక్తులు దర్శించి పూజలు నిర్వహిస్తున్నారు. ఊబలంక శివాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం, రావులపాలెం శెట్టిబలిజనగర్‌లో సిద్ధివినాయక యువజన సంఘం, దక్షిణ వీధి రామాలయం, మార్కెట్ రోడ్డు, చిన్న కారు స్టాండ్, వైఎస్సార్ జంక్షన్ వద్ద, పార్కు గేటు వద్ద, రెల్లి యూత్ ఆధ్వర్యంలో పార్కు వెనుక వైపు కూడలితో పాటు, వివిధ కూడళ్లలో గణనాథుని మండపాలు ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అలాగే మండపాల వద్ద విద్యుత్ దీపాలంకరణ, ఆహ్వాన ద్వారాలను భారీ సెట్టింగ్‌లతో ఏర్పాటు చేశారు. ఆదివారం గణనాథునికి ప్రత్యేక పూజలతో పాటు, భజనలు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అలమూరులో..

అలమూరు: గణపతి నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాలు, మండపాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని ఆయా గ్రామాల్లోని కూడళ్లు, వీధుల్లో గణనాథుడ్ని ప్రతిష్ఠించిన భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అలమూరు, చెముడులంక, పెనికేరు, పినపళ్ల, సందిపూడి, చింతలూరు, నర్శిపూడి, చొప్పెల్ల తదితర గ్రామాల్లోని వినాయకుని ఆలయాలు, మంటపాలు వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల వద్ద నిర్వాహకులు భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అలాగే ఉదయం, సాయంకాలం వేళల్లో భక్త దంపతులు గణనాథుడికి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అలమూరులోని వినాయకుని ఆలయంలో ప్రతిష్ఠించిన 13 అడుగుల మట్టి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: వాడవాడలా శనివారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వినాయకుని ఆలయాలుతో పాటు, ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పందిళ్లల్లో వినాయక చవితి వేడుకలు జరిగాయి. సఖినేటిపల్లిలంకలో ఉత్సవ కమిటీ నిర్వహించిన చవితి వేడుకల్లో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, నాయకులు కొండా కిషోర్, అయినవిల్లి సత్యనారాయణ, గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్, గుండుబోగుల పెదకాపు పాల్గొన్నారు. అలాగే సఖినేటిపల్లిలో స్థానిక అల్లూరి సీతారామరాజు క్షత్రియ కల్యాణ మండపంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో వైఎస్సార్ సీపీ రాజోలు ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు ప్రత్యేక పూజలు చేశారు. వేటుకూరి సూర్యనారాయణరాజు, వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే కొక్కిరాయ కాలువగట్టు ఏరియాలో గౌడ యూత్ ఆధ్వర్యంలో జరిగిన చవితి వేడుకల్లోనూ సూర్యారావు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: వినాయక చవితి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామ కూడళ్లు, ప్రధాన ప్రదేశాల్లో పందిళ్లు ఏర్పాటు చేసి వాటిలో భారీ గణనాథులను కొలువుదీర్చారు. సుందరంగా తీర్చిదిద్దిన పందిళ్లలో చిత్ర, విచిత్రంగా తయారు చేసిన గణనాథుల విగ్రహాలను నెలకొల్పారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, బాజా భజంత్రీలు, భక్తుల కోలాహలం నడుమ కలశ స్థాపన చేసి గణపతి నవరాత్ర వేడుకలను అద్యంతం రమణీయంగా జరిపించారు. మండలంలోని పలు గ్రామాల్లో చవితి వేడుకలు వైభవంగా జరిగాయి.

మలికిపురంలో..

మలికిపురం: వినాయక చవితి వేడుకలు మండలంలో ఘనంగా జరుగుతున్నాయి. నవరాత్ర మహోత్సవాలను నిర్వహించేందుకు ప్రతి కూడలిలోనూ వినాయక విగ్రహాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీలు పలు సాంస్కృతిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మలికిపురంలో వినాయక విగ్రహానికి రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్, నాయకులు పెదకాపు, లక్ష్మణ్, ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి తదితరులు పూజలు చేశారు. చింతలమోరిలో మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పూజలు చేశారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: మండలంలోని 17 గ్రామాల్లో వినాయక చవితి పురస్కరించుకుని చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ఆత్రేయపురం, ర్యాలి, వాడపల్లి, పేరవరం, లొల్ల తదితర గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. చవితి సందర్భంగా గణనాథుని విగ్రహాలు ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. ఆయా ఆలయాల వద్ద ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎడతెరిపి లేని వర్షం


వర్షానికి నిర్మానుష్యంగా మారిన అంబాజీపేట ప్రధాన రహదారి

అంబాజీపేట: వాయుగుండం కారణంగా అంబాజీపేట మండలంలో ఆదివారం వేకువజాము నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో రహదారులపై నీరు నిలిచిపోయాయి చెరువులను తలపించాయి. వర్షం కారణంగా రోడ్ల పై వెలసిన చిరు వ్యాపారాలు వెలవెలబోయాయి. గ్రామాల్లో నెలకొల్పిన చవితి పందిళ్ల వద్ద పూజలకు వెళ్లే భక్తులు వర్షానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంబాజీపేట హైస్కూల్, బస్టాండ్ ప్రాంగణం నీట మునిగింది.

ఆహ్లాదాన్ని అందించే చిత్రాలే తీస్తా...

ఆయ్ చిత్ర దర్శకుడు అంజిబాబు

మామిడికుదురు: ఆహ్లాదాన్ని అందించే సినిమాలు తీయాలన్నదే తన ఆకాంక్ష అని 'ఆయ్' చిత్ర దర్శకుడు కంచిపల్లి అంజిబాబు తెలిపారు. అమలాపురం కొంకాపల్లికి చెందిన అంజిబాబు పాశర్లపూడిలంకకు చెందిన కోలా శ్రీనివాస్ అల్లుడు. వినాయక చవితి పండగకు శనివారం అత్తవారింటికి వచ్చిన అంజిబాబును గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. 'ఆయ్' చిత్రం విజయోత్సవాన్ని పురస్కరించుకుని అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను అంజిబాబు కట్ చేశారు. అనంతరం స్థానికులు ఘనంగా సత్కరించారు. సినీ అభిమానుల మన్ననలు అందుకుంటున్న 'ఆయ్' చిత్ర దర్శకుడు తమ గ్రామం అల్లుడు కావడం తమందరికీ ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ చిత్రం సాధించిన సక్సెస్‌ను అతనితో పాటు మేమంతా ఆస్వాదిస్తున్నామని గ్రామ సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు కోలా సత్యనారాయణ, కోలా సత్తిబాబు పేర్కొన్నారు. దర్శకుడు అంజిబాబు మాట్లాడుతూ గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో తర్వాతి చిత్రం ఉంటుందన్నారు. తాను ఎస్‌కేబీఆర్ కళాశాలలో చదువుకున్నానని, పలు చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశానన్నారు. మొదటి చిత్రం 'ఆయ్' సక్సెస్ సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పితాని వెంకటేశ్వరరావు, తెలగారెడ్డి బులి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


పాశర్లపూడిలంకలో కేక్ కట్ చేస్తున్న దర్శకుడు అంజిబాబు

గణపతి ఉత్సవాలకు రూ.25 వేల విరాళం


అలమూరులో నిర్వహిస్తున్న గణపతి నవరాత్ర ఉత్సవాలకు విరాళం అందజేస్తున్న ప్రభాకరరావు

అలమూరు: గ్రామంలో వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్ర మహోత్సవాల నిర్వహణకు రూ.25 వేలు విరాళం అందజేత జరిగింది. గ్రామానికి చెందిన శ్రీకృష్ణదేవరాయ కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు ఆయా మండపాల వద్దకు వెళ్లి నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. పసుపులేటి వారి వీధిలోని రెండు మండపాలకు రూ.15 వేలు, ఎర్ర కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి మండపానికి రూ.10 వేలు అందజేశారు. చల్లా నానాజీ, చిన్నం హరిబాబు, చల్లా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు నీటి సమస్యపై మహిళల ఆందోళన

మామిడికుదురు: పాశర్లపూడిబాడవ సత్తరువు తోటలో ముంపు నీటి సమస్య తమను వేధిస్తోందంటూ కాలనీ వాసులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ముంపు నీటిలో దిగి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మూడు దశాబ్దాల నుంచి ముంపు సమస్య ఉన్నా దాన్ని పరిష్కరించేందుకు ఏ ఒక్కరూ చొరవ చూపడం లేదని వాపోయారు. ఏటా వర్షాకాలంలో ముంపు నీటి సమస్యతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఫైలేరియా, డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేము మనుషులమే ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీ సదుపాయం కల్పించాలని, కాలనీలో రోడ్లను మెరక చేయాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. ఇప్పటికైనా సత్తరువు తోట కాలనీ సమస్యలపై స్పందించని పక్షంలో తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ మృత్యుంజయరావు సత్తరువు తోట కాలనీని పరిశీలించారు. ముంపునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


ముంపు నీటిలో నిరసన తెలుపుతున్న సత్తరువు తోట కాలనీ వాసులు

భక్తిశ్రద్ధలతో షబ్బేదారి కార్యక్రమం

మామిడికుదురు: మొహర్రం సంతాప కార్యక్రమాల్లో భాగంగా షబ్బేదారి కార్యక్రమం నగరంలో శనివారం నిర్వహించారు. అంజుమనే ఫాజి అబ్బాస్ భక్త బృందం ఆధ్వర్యంలో జాగరణ జరిగింది. మత ప్రబోధకుడు నామ్దార్ అబ్బాస్ మజ్లిస్ ఆలపించారు. సుదూర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని హజరత్ ఇమామ్ హుస్సేన్ పరివారానికి ఘనంగా నివాళులర్పించారు. మత ప్రబోధకుడు సయ్యద్ అబ్బాస్ బాకరి కార్యక్రమాల్లో పాల్గొని షబ్బేదారి వృత్తాంతాన్ని భక్తులకు వివరించారు. మాతం నిర్వాహకులు అలీ హసన్ జాఫర్ ఆధ్వర్యంలో గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. పలు భక్త బృందాలు భక్తులకు సదుపాయాలు ఏర్పాటు చేశారు.


నగరంలో జరిగిన షబ్బేదారిలో పాల్గొన్న ముస్లింలు

తుప్పలు, తీగలతో విద్యుత్ స్తంభం


ఇసుకపూడిలో విద్యుత్ స్తంభానికి అల్లుకుపోయిన తీగలు

అంబాజీపేట: ఇసుకపూడి సీతారామ్ నగర్‌లో విద్యుత్ స్తంభానికి, ట్రాన్స్‌ఫార్మర్‌ను, విద్యుత్ వైర్లను తుప్పలు, తీగలతో అల్లుకుపోయాయి. ఇక్కడి విద్యుత్ స్తంభం ఉందా లేక పిచ్చి మొక్కలు మొలిచాయా అన్న చందంగా ఉంది. ట్రీ కటింగ్ పేరిట విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం విద్యుత్ సరఫరాను ఉదయం నుంచి సాయంత్రం వరకు నిలుపుదల చేసి మరీ మరమ్మతులు చేస్తున్నారు. ఈ ట్రీ కటింగ్ చేస్తున్న సమయంలో తుప్పలు, తీగలతో నిండిపోయిన విద్యుత్ స్తంభం కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికుల విమర్శిస్తున్నారు. తరచూ విద్యుత్ సౌకర్యానికి అంతరాయం ఏర్పడిన సమయంలో విద్యుత్ వైర్ల వెంబడి తనిఖీ చేస్తారు. అయినా విద్యుత్ శాఖ అధికారులకు కనిపించలేదా.. లేక నిర్లక్ష్యమో అర్థం కాలేదంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రమాదకరంగా విద్యుత్ స్తంభానికి అల్లుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

తగ్గుముఖం పట్టిన వరద

పి.గన్నవరం: కోనసీమలోని వశిష్ట, వైనతేయ, గౌతమీ నదీపాయల్లో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మానేపల్లి శివారు శివాయలంకకు వెళ్లే రహదారి ముంపు నుంచి బయటపడటంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై ఇంకా వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో కనకాయలంక ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాల వల్ల రేవులు బురదమయం కావడంతో పడవలు దాటేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపైనే వెళ్తున్నారు. అలాగే మన జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, సిర్రావారిలంక, ఆనగర్లంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు కూడా పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

శాంతించిన గోదావరి

అయినవిల్లి: గోదావరి నది శాంతించడంతో ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద కాజ్‌వేపై వరద ఆదివారం పూర్తిగా తగ్గుముఖం పట్టింది. కాజ్వేపై రాకపోకలు యథాతథంగా కొనసాగాయి. ముక్తేశ్వరం వృద్ధగౌతమి పాయ వద్ద పాత వంతెన వరద నీటిలో ఉంది. పాయలో వరద ఉధృతిగా ప్రవహిస్తోంది. లంక గ్రామాలల్లో పల్లపు ప్రాంతాలను చుట్టిముట్టిన వరదతో పలు పంటలు నీట మునిగాయి. వరుసగా రెండోసారి వరద రావడంతో రైతులు తమ పంటలు దెబ్బతిన్నాయని పంట నష్టం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

కాజ్‌వేను వీడిన ముంపు

మామిడికుదురు: గోదావరి వరద పూర్తి స్థాయిలో తగ్గింది. దీంతో అప్పనపల్లి కాజ్‌వే ముంపు నుంచి ఆదివారం బయట పడింది. ముంపు నుంచి కాజ్‌వేకు విముక్తి కలగడంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు రాకపోకలు పునః ప్రారంభమయ్యాయి. రెండు రోజుల క్రితం కాజ్‌వే ముంపు బారిన పడడంతో పోలీస్, రెవెన్యూ అధికారులు కాజ్‌వే మీదుగా రాకపోకలను నిలిపి వేశారు. ముంపు వీడి కాజ్‌వే మీదుగా వాహనాల రాకపోకలు సాగించడంతో మూడు గ్రామాల ప్రజలు ఉపశమనం పొందారు.

ఈ ఏడాది గోదావరి వరద రెండో సారి లంక గ్రామాల ప్రజల్ని కలవర పాటుకు గురి చేసింది. జూలై నెలలో మొదటి సారి వరద తీర గ్రామాల ప్రజలను ఇబ్బందులకు గురి చేయగా రెండో సారి కలవర పాటుకు గురి చేసింది. తీర గ్రామాలకు పెద్దగా సమస్యలు సృష్టించకుండా వరద తగ్గడంతో లంక గ్రామాల ప్రజలు ఉపశమనం పొందారు. వరద వల్ల పశుగ్రాసం పూర్తిగా పాడైపోయిందని, మూగ జీవాల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని తీర గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


పి.గన్నవరం మండలం బూరుగులంక రేవులో పడవ ఎక్కుతున్న ప్రజలు


వరద ముంపు నుంచి బయట పడిన అప్పనపల్లి కాజ్‌వే